# సింగరాజు బంగళా

సింగరాజు మేడ అంటే ఓ పెద్ద దివాణంలా ఉంటుంది. నూట పది సంవత్సరాల క్రితం వాళ్ల తాతగారు కట్టించారు. ముప్పై పడక గదులు, చుట్టూ వరండా, రెండు వందల విస్తర్లు లేచే వంటశాల, కాంపౌండ్‌లో ఓ పది సర్వెంటు క్వార్టర్లతో వైభవోపేతంగా ఉంటుంది ఆ బంగళా.

సింగరాజు తాతగారి పేరు కూడా సింగరాజే. తండ్రి రామరాజు హయాంలో చుట్టూ ఉన్న మాగాణి పొలాలన్నీ సినిమాలకి పెట్టుబడి కింద నాశనం అయిపోయాయి. ఆరేడు సినిమాలకి నిర్మాతగానూ, ఆ తరువాత ప్రొడక్షన్ మేనేజర్‌గానూ అతని పేరు పడి ఆస్తంతా హారతి కర్పూరంలా దహించుకుపోయింది. అప్పుల ఊబిలో మునిగి పోతున్నప్పుడు... తండ్రి కట్టించిన బంగళా అమ్మేస్తే తెరిపిన పడేవాడేమో లేదా ఇంకో సినిమాకి పెట్టుబడి పెట్టి దివాళా తీసేవాడేమో. బుర్రలో ఆ ఐడియా రాకుండానే మద్రాసులో తను తీసుకున్న ఆఫీసులో ఉరి వేసుకుని చచ్చిపోయాడు. అప్పులు లేవు... ఆస్తులు లేవు. ఈ బంగళా

మాత్రం మిగిలిపోయింది!

అతనికి సినిమా వ్యసనం... సినిమా దాహం. ఆస్తంతా హరాయించుకుపోతున్నా తండ్రి కట్టించిన బంగళా మీద కొద్దిపాటి మమకారం. ఇంతో అంతో పరువుకోసం ఆ ఇంటిని అలాగే వదిలిపెట్టాడు. మకాం దాదాపుగా మద్రాసే.

తనూళ్లో టూరింగ్ టాకీసులో తన పేరు పడే సినిమాలు ఆడుతున్నప్పుడు ఖచ్చితంగా మద్రాసు నుంచి తనూరొచ్చి ఆ టాకీసు దగ్గరకి దర్జాగా కారు వేసుకుని తిరిగి, 'మహాలక్ష్మి పిక్చర్ ప్రొడక్షన్' అని కారు వెనకాల రాసిన అక్షరాలు పాపులర్ చేసుకొనేవాడు.

సొంత ఊళ్లో ఒక నిర్మాతగా డాబుని ప్రదర్శిస్తూ అవసరం ఉన్న వాళ్లతోనూ లేని వాళ్లతోనూ కారాపి షోగ్గా పలకరిస్తూ, వాళ్లతో... ముఖ్యంగా హీరోయిన్‌లతో తనకున్న పరిచయాల గురించి చిలవలు పలవలు చేసి చెప్తూ, త్వరలో ఎన్.టి.ఆర్, జమున, సావిత్రి, నాగేశ్వర్రావులతో సినిమా ప్లాన్ చేస్తున్నానని డప్పాలు కొట్టేవాడు. మన ఊళ్ళోనే... ఈసారి షూటింగ్ పెడుతున్నానని రెచ్చిపోతూ చెప్పేవాడు. చాటుగా నవ్వుకునేవాళ్లు నవ్వుకునేవాళ్లు. ప్రేమగా బాధపడేవాళ్ళు పడేవాళ్లు. 'పెద సింగరాజు సంపాదించిన ఆస్తినంతటినీ కోల్పోయావు. కొడుకు కోసం ఈ బంగళా అయినా ఉంచ'మని మందలించేవారు ఊరి పెద్దలు కొందరు. మెచ్చుకోలుగా మాట్లాడిన వాళ్ళ దగ్గర దర్పంతో, నీతులు సలహాలు చెప్పేవాళ్ల దగ్గర కోపంతో 'కోట్లకి పడగలెత్తుతాను' అనే శపథంతో పొగరుగా వెళ్లేవాడు.

మద్రాసు వెళ్లిన రామరాజు ఆఖరిసారి దర్జాగా కారులో రాలేదు. ఉరితాడు నుంచి అద్దె టాక్సీలో శవంగా ఇంటికి చేరాడు- చిన సింగరాజు భోరు మన్నాడు. తండ్రిని ఏమీ తప్పుపట్టలేదు. ఊళ్లో వాళ్లు ఎన్ని మాటలు

అన్నా పట్టించుకోలేదు.

✦ ✦ ✦

చిన సింగరాజుకి మిగిలింది ఆ బంగళానే-

మొన్నీమధ్యన ఒక యువ హీరోతో ఈ ఊళ్లో సినిమా షూటింగ్ చేయడానికి ముప్పై రోజులు, యూనిట్ అంతా బస చేయడానికి సింగరాజు బంగళా తీసుకున్నారు. ఆ యువ హీరో ఆ పల్లెటూళ్లో అంత హంగులతో సదుపాయంగా కట్టిన బంగళా చూసి దాని మీద మనసు పడ్డాడు.

ప్రొడక్షన్ మేనేజర్‌ని పిలిచి "రోజుకి ఎంత అద్దె ఇస్తున్నావు ఈ బంగళాకి?" అని అడిగాడు.

"ఈ ముప్పై రోజులకీ మనకి పదకొండు వేలు అయినట్లు" అన్నాడు మేనేజర్.

ఆశ్చర్యపోయాడు యువహీరో- "ముప్పై గదులూ... పది ఔట్ హౌసులకీ కలిపి... నెలకి... పదకొండు వేలేనా? ఇది వాడి తెలివి తక్కువ తనమా, నీ తెలివి తేటలా?" అని అడిగాడు హీరో.

"ఓనర్ అసలు అద్దే వద్దన్నాడు సార్! నేను ఇల్లు కడిగించి బూజు దులిపించి వెల్లలు వేయించడానికి పదకొండు వేలు ఖర్చు అయింది అంతే... అదీ మెటీరియల్ కొనటానికే. పనంతా ఓనరే స్వయంగా చేసుకున్నాడు- సర్వీసు ఛార్జీ కూడా తీసుకోకుండా"

"ఏంటిట ప్రాబ్లం స్క్రూ లూజా? సినిమా క్రేజా?"

"కాదు సార్... మమకారం... ఈ ఇంటిమీద మమకారం"

అర్థంకానట్లు చూసాడు హీరో.

"సున్నం వేస్తున్నప్పుడు... బూజు దులుపుతున్నప్పుడు గోడల మీదా

నేల మీదా బ్రష్షులూ చీపుళ్లూ వాడటానికే గిలగిల్లాడిపోయేవాడు. ఓపిక లేదు గానీ ఇల్లంతా నోటితో ఊది శుభ్ర పరిచే రకం" నవ్వుతూ చెప్పాడు మేనేజర్.

"నేను అతన్ని చూసానా" వండరౌతూ అడిగాడు హీరో.

"భలే వారే సార్. రోజూ మిమ్మల్ని నిద్రలేపి రూమ్ క్లీన్ చేసి వెళ్లిపోతాడే ఆయన... ఆయనే ఓనరు"

"ఎవరు? ఆ ముసలాయనా?" అంటూ యువహీరో షాక్ అయ్యాడు.

నిజంగానే "చీపురు పెట్టి తుడవాల్సిన చోట భుజంపై తువ్వాలు తీసి తుడవటం, చేతుల్తో అద్దాలు శుభ్రపరచటం చూసి ఓవర్ ఏక్షన్‌గాడు అనుకున్నాను నేను" అన్నాడు.

"ఓవర్ ఏక్షన్ కాదు సార్... ఓవర్ ఎఫెక్షన్... ఈ ఇల్లు అతని వళ్లు లాంటిదని ఫీలవుతాడు"

"అయితే... అతనితో ఓ సారి మాట్లాడాలి"

"దేనికి సార్"

"ప్లీజ్ అతన్ని పిలు"

✦ ✦ ✦

యాభై... అరవై... డెభ్భై లక్షలు... ఇస్తానన్నా ఆ బంగ్లా అమ్మనన్నాడు సింగరాజు.

"నేనీ ఇల్లు కూల్చను. దీని షేపు మార్చను... ఈ బంగళా ఇలాగే ఉంచుకుంటాను. ఇలాగే మెయిన్‌టైన్ చేస్తాను. ఇది నాది అనిపించు కోవాలని నా కోరిక" ప్రాధేయపడుతూ అడిగాడు హీరో.

"బాబూ... నా ఇల్లు. మీకింత నచ్చినందుకు సంతోషం... ఈ ఇల్లు...

మామూలు ఇల్లు కాదు. పూటకి వందమంది అన్నం తిన్న స్థలం ఇది. ఇప్పుడు నేనూ మా ఆవిడా ఇద్దరమే! తను వారానికి ఏడు గదులు చొప్పున పొద్దుణ్నుంచి సాయంత్రం వరకూ శుభ్రం చేస్తుంది. మేము ఎవరికీ అద్దెకివ్వం- అమ్మం... అద్దెకి తీసుకున్నవాళ్లు 'ఇది మా వాటా' అనుకున్నా మేం భరించలేం... నేను పగలంతా మునసబుగారి రొయ్యల చెరువుకి కాపలాకి వెళ్తాను. ఆయనిచ్చే జీతం డబ్బుల్తో కలో గంజో తాగి పడుకుంటాం. మీకు తెల్సా- మేం రోజుకో గదిలో ఉంటాం. ఇల్లంతనీ మా దుప్పట్లో కప్పుకున్నట్లు... మా చేతుల్తో కావలించుకున్నట్లు తృప్తిగా పడుకుంటాం. ఇప్పుడిలా మీ షూటింగనీ ఇంట్లో ఇంతమంది గుమికూడ తారని చెప్పినప్పుడు మా తాతలనాటి కలకలం కనిపిస్తుందనీ మీరిక్క డుంటానంటే వప్పుకున్నాను. మీ దయవల్ల మళ్లీ మా ఇంటికి రంగు లొచ్చాయి. అన్ని గదుల్లోనూ దీపాలు వెలిగాయి. నా కష్టార్జితంతో నేనెప్పటికీ ఈ బంగ్లాకి ఈ కళ తేలేను. అంతా తాతగారి దయ"

కళ్లు తుడుచుకుంటూ సింగరాజు చెప్తున్న మాటలు యువహీరో చాల ఆర్ద్రంగా విన్నాడు.

"సింగరాజుగారూ మీ సెంటిమెంట్ నాకు మీ ఇంటికన్నా నచ్చింది. మీ ఆర్థిక పరిస్థితి నాకు తెల్సు. నేను మీ యిల్లు కొనను. కొన్నా నాఇ అనను. మిమ్మల్ని ఖాళీ చెయ్యమనను. కానీ... మీ తర్వాత ఈ బంగళాని ఏం చేయదల్చుకున్నారో చెప్పండి. నేను ఏం చేయాలో ఆలోచించు కుంటాను" మొహమాటపడుతూ అన్నాడు హీరో.

సింగరాజు చాలాసేపు మాట్లాడలేకపోయాడు.

నెమ్మదిగా గొంతు సవరించుకుని "ఈ బంగళా నాది కాదు బాబూ... మా నాన్నది కూడా కాదు, మా తాతగారిది" గొంతు గద్గదమౌతోంది.

"మీరు చెప్పింది నాకు అర్థమైంది. కానీ ఒక్కమాట చెప్తాను. మీ

ఇంటికి మీరే యజమాని... ఇదెప్పటికీ సింగరాజు బంగళాగానే ఉంటుంది. మీ తర్వాత నేను కూడా ఇలాగే ఉంచుతాను. నేను మీకు కోటిరూపాయలు ఇస్తాను. ఆ డబ్బుతో పదిమందితో కల్సి తినటానికి వాసయోగ్యంగా ఉంచుకోండి. మీ తృప్తికోసం అందరికీ అన్నం పెట్టుకోండి- మీ తాతగారి నాటి వైభవం ఉంచుకోండి"

సింగరాజు ఏమీ మాట్లాడలేక పోయాడు.

కళ్ళల్లో నీళ్లు పొంగాయి. రెండు చేతులూ జోడించాడు. హీరో మాటల్లో స్వార్థంలేని నిజాయితీని గమనించాడు. తను పోయినా తన తాతగారి బంగ్లా నిలబెడతానన్న అతని మాటకి పులకించి పోయాడు. నెమ్మదిగా కూడబలుక్కున్నట్లు "కానీ... బాబూ... నేనో మా ఆవిడో ఎవరు ముందు పోయినా... రెండోవాళ్ళు పోయేదాకా మీకీ బంగ్లా అప్పజెప్పలేము. అందుకు అభ్యంతరం లేకపోతే... మీరిస్తానన్న సొమ్ము బ్యాంకులో వెయ్యండి. ఆ వడ్డీ డబ్బుల్తో మా బంగళా సందడిగా వుంచుతాం... మేం పోయాక ఆ సొమ్ము కూడా మీదే... మా తాతగారి పేరు మీదే ఈ బంగళా ఉంటుం దంటున్నారు. నాకంతకన్నా కావాల్సింది ఏమీ లేదు"

వారం తర్వాత రాతకోతలయ్యాయి. బ్యాంకులో డబ్బు డిపాజిట్ చేశాడు హీరో.

ఇది జరిగి 20 ఏళ్లు అయింది. చిన సింగరాజుకి 70 ఏళ్లు దాటాయి. భార్య కూడా గతించింది. సింగరాజు మాత్రం నౌకర్లనీ చాకర్లనీ పెట్టి తన భవనాన్ని కాపాడుకుంటున్నాడు... కాదు తన ఇంటికి తనే వాచ్ మెన్‌గా ఉంటున్నాడు. ఆ ఊరొచ్చిన కొత్త వాళ్లకీ ఊరూ పేరూ లేని ఊళ్లోవాళ్లకి ఆత్మీయంగా అన్నం పెడుతున్నాడు. ఏడాదికో పది రోజులు హీరో కూడా వచ్చి సింగరాజు బంగళాలో భోజనం చేసి వెళ్తుంటాడు... అదీ గెస్టుగానే.